THE తెలంగాణ మిర్రర్

ఈవెనింగ్ ఎడిషన్

సోమవారం 13.04.2026

పేజీలు 2

హుస్నాబాద్‌లో ఆర్టీసీ టికెట్ రసీదులు

‘కోడి కూరకు బిల్లులు?

- వ్యవస్థపై వ్యంగ్యపు గుద్దులు
- బస్సులో ఇచ్చే టికెట్... బజార్లో చికెన్ కు బిల్లు!
- హుస్నాబాద్‌లో ‘రోల్’ గోల
- చికెన్ సెంటర్లో ఆర్టీసీ అధికారుల తనిఖీ
- యజమానిపై పోలీసులకు ఫిర్యాదు



ఆర్టీసీ టికెట్ రోల్ బిల్లుపై చికెన్ అశ్రప్ చికెన్ సెంటర్ ముద్రణతో జారీ చేసిన లేటెస్ట్ బిల్లు

హుస్నాబాద్, ఏప్రిల్13(ది తెలంగాణ మిర్రర్):
హుస్నాబాద్ పట్టణంలో వెలుగులోకి వచ్చిన ఆర్టీసీ టికెట్ రోల్ దుర్వినియోగం ఘటన ఇప్పుడు చర్చలకే కాదు, వ్యంగ్యాలకు కూడా కారణమవుతోంది. ప్రయాణికులకు ఇవ్వాల్సిన టికెట్ రోల్, కోడి ముక్కల బిల్లులుగా మారడం చూసి ప్రజలు “ఇదేనా డిజిటల్ ఇండియా?” అంటూ చమత్కరిస్తున్నారు.

సోమవారం బయటపడిన ఈ వ్యవహారం ప్రకారం, హుస్నాబాద్‌లోని ఓ చికెన్ సెంటర్‌లో ఆర్టీసీ టికెట్ రోల్ కాగితాలపై బిల్లులు ఇస్తున్నారనే సమాచారం అందడంతో అధికారులు దాడి చేశారు. అక్కడ కుప్పలుగా ఉన్న టికెట్ రోల్స్, వాటిపై ముద్రించిన చికెన్ బిల్లులు చూసి అధికారులు కూడా కాసేపు ఆశ్చర్యానికి గురయ్యారట. బస్సులో కట్ చేయాల్సిన టికెట్, బజార్లో కట్ అవుతుండటం చూసి “సర్వీస్ ఎక్స్‌పాంషన్ ఇదేనా?” అని స్థానికులు వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు.



చికెన్ సెంటర్ లో దొరికిన ఆర్టీసీ రోల్ టికెట్లు

దుకాణ యజమాని అప్సర్‌ను డిపో మేనేజర్ వెంకన్న ప్రశ్నించినప్పటికీ, ఆయన నోరు మెదపకపోవడం మరింత సందేహాలకు దారి తీసింది. “టికెట్ రోల్ ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పలేని వ్యక్తి... చెప్పకూడదనుకుంటున్నాడా?” అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. చివరకు పోలీసులు రంగంలోకి దిగడంతో ఈ ‘రోల్ కథ’ మరింత సీరియస్ మలుపు తీసుకుంది.

ఇక అసలు ట్విస్ట్ ఏమిటంటే... ఈ టికెట్ రోల్స్ సాధారణ కాగితాలు కావు. ఇవి ప్రభుత్వ రికార్డులే. అంటే బస్సులో ప్రయాణానికి గుర్తు, ఇప్పుడు చికెన్ కొనుగోలుకు రసీదు! ఈ మార్పు ఎలా జరిగిందో అనేది పెద్ద మిస్టరీగా మారింది. “బస్సు నుంచి బజారుకు రోల్ ప్రయాణం” వెనుక ఎవరి హస్తం ఉందన్నది ఇప్పుడు హాట్ టాపిక్.

నిపుణులు చెబుతున్నది ఏమిటంటే, ఇది ఒక్క దుకాణం కథ కాదు. టికెట్ రోల్స్ బయటకు రావాలంటే లోపల ఎవరో ‘సహకారం’ తప్పనిసరి. స్టోర్ నుంచి బయటకు వచ్చినా, మధ్యలో ఎవరైనా పట్టించుకోకపోయినా... చివరకు కోడి షాప్‌కి చేరిన ఈ రోల్స్ వ్యవస్థలో ఉన్న లూప్ హోల్స్‌ను బహిర్గతం చేస్తున్నాయి. “టికెట్ కట్ చేసే వాళ్లే... సిస్టమ్‌ని కట్ చేస్తున్నారా?” అనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హలో చికెన్ సెంటర్లో యజమానిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎం వెంకన్న దృశ్యం

లీగల్ కోణం కూడా తీవ్రమే...

ఈ వ్యవహారం కేవలం వ్యంగ్యానికి మాత్రమే పరిమితం కాదు... చట్టపరంగా కూడా ఇది తీవ్రమైన నేరంగా మారే అవకాశం ఉంది. భారతీయ శిక్షాస్మృతి (భాజ) ప్రకారం ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం, మోసం, నకిలీ పత్రాల వినియోగం వంటి సెక్షన్లు వర్తించే అవకాశం ఉంది.

సెక్షన్ 409:
ప్రభుత్వ ఉద్యోగి తన ఆధీనంలోని వస్తువులను దుర్వినియోగం చేస్తే క్రిమినల్ బ్రిచ్ ఆఫ్ ట్రస్ట్ కింద కేసు నమోదవుతుంది.

సెక్షన్ 420:
మోసం చేసి లాభం పొందడం.
సెక్షన్ 468 ఉ 471: నకిలీ లేదా దుర్వినియోగ పత్రాల వినియోగం.

అదేవిధంగా ప్రభుత్వ ఆస్తులను వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించడం కూడా నేరంగా పరిగణించబడుతుంది. ఈ నేపథ్యంలో టికెట్ రోల్స్ లీక్‌లో ఆర్టీసీ సిబ్బంది ప్రమేయం ఉంటే, వారిపై డిపార్ట్‌మెంటల్ చర్యలతో పాటు సస్పెన్షన్, ఉద్యోగం కోల్పోవడం, జైలుశిక్ష వంటి కఠిన పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రైవేట్ వ్యక్తులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు అయ్యే అవకాశముంది. మొత్తానికి, హుస్నాబాద్‌లో ‘టికెట్ రోల్’ కథ ఇప్పుడు సామాన్య ప్రజలకు నవ్వు తెప్పించినా... వ్యవస్థకు మాత్రం నిద్ర లేకుండా చేసే ఘటనగా మారింది. “బస్సులో టికెట్... బజార్లో బిల్లు” అనే ఈ కొత్త ట్రెండ్‌కు ఎండ్ కార్డ్ పడుతుందా? లేక ఇంకెక్కడైనా ‘రోల్ అవుట్’ అవుతుందా? అన్నది ఇప్పుడు అధికారుల విచారణపై ఆధారపడి ఉంది.

దౌల్తాబాద్ : ధర్మారంలో భాగ్య అలియాస్ రూపీ చిన్న పెంకుటిల్లు

కాంకేర్ ఎన్‌కౌంటర్‌లో సిద్ధిపేటకు చెందిన ‘రూపి’ మృతి

- సిద్ధిపేట జిల్లా మిడిదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన భాగ్య అలియాస్ రూపి
- ఆమెపై గతంలో రూ. 25 లక్షల రివార్డ్ ప్రకటించింది

భాగ్య అలియాస్ రూపీ వయసు 46 ఏళ్ళు ఆమె 2004లో మావోయిస్టు పార్టీలో చేరిక . ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆ తర్వాత అబ్జమడ్ ప్రాంతంలో పనిచేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో జరిగిన డిజిపి విడుదల చేసిన జాబితాలో తెలంగాణలోని లొంగుబాట్ల సందర్భంగా అందులో భాగ్య ఆలియాస్ రూపి పేరు ఉంది.

దౌల్తాబాద్ ఏప్రిల్ 13(ది తెలంగాణ మిర్రర్) ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లా నక్సల్ ప్రభావిత అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు నిర్వహించిన కూబింగ్ ఆపరేషన్‌లో సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు ఏరియా కమాండర్ భాగ్య అలియాస్ రంగబోయిన భాగ్య అలియాస్ రూపీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందింది. ఆమెపై ప్రభుత్వం రూ. 25 లక్షల రివార్డు ప్రకటించిన విషయం తెలిసిందే.

చోటే బెటియా పోలీస్ స్టేషన్ పరిధిలో మావోయిస్టులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టగా, ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో రూపి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమెతో ఉన్న మరికొందరు మావోయిస్టులు తప్పించుకున్నట్లు సమాచారం. ఘటనాస్థలం నుంచి ఒక ఆటోమెటిక్ ఆయుధం, విప్లవ సాహిత్యం స్వాధీనం చేసుకున్నారు.మృతురాలు సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందినదిగా గుర్తించారు. 2004లో మావోయిస్టు పార్టీలో చేరిన ఆమె పార్థాపూర్ ఏరియా కమాండర్‌గా పనిచేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ మాట్లాడుతూ, మావోయిస్టులు హింసను వీడి లొంగిపోవాలని పిలుపునిచ్చారు. కాగా, రూపి మృతితో ఆమె స్వగ్రామం ధర్మారం గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

పోషణ పక్వాడలో పోషకాహార వంటల ప్రదర్శన

దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ది తెలంగాణ మిర్రర్) : మండల పరిధిలోని మాచిన్‌పల్లి 1, 2 అంగన్వాడి కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పోషకా హారంపై అంగన్వాడి సూపర్వైజర్ గిరిజ విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం గ్రామ సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ పెద్దోళ్ల కవిత, అంగన్వాడి సూపర్వైజర్ గిరిజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానికంగా లభించే పోషక విలువలున్న ఆహార పదార్థాలు, ముఖ్యంగా చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. తల్లులకు మిల్లెట్స్‌తో వివిధ వంటకాలను ఎలా తయారు చేయాలో వివరించగా, వంటల పోటీలు నిర్వహించి ప్రోత్సహించారు.ప్రతి వంటకంలోని పోషక విలువలను వివరించి, సమతుల ఆహారం ప్రాముఖ్యతను తెలియజేశారు. ఇంటి స్థాయిలో కూడా ఈ వంటకాలను అలవాటు చేసుకోవాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అనంతరం అంగన్వాడి లెవల్ మానిటరింగ్ కమిటీ (ఎల్‌ఎంసీ)ను ఏర్పాటు చేశారు. సర్పంచ్‌ను చైర్‌పర్సన్‌గా, అంగన్వాడి టీచర్‌ను కన్వీనర్‌గా నియమించి మొత్తం 11 మంది సభ్యులతో కమిటీని రూపొందించారు. ఆరోగ్య లక్ష్మి పథకం అమలు, ఆహార పంపిణీ, అంగన్వాడి సమస్యల పరిష్కారానికి ఈ కమిటీ కీలకంగా పనిచేస్తుందని అధికారులు తెలిపారు.

తండ్రి మరణ బాధను దిగమింగుకొని పరీక్షకు హాజరైన విద్యార్థిని ఐశ్వర్య...

తండ్రి మృతదేహం ఇంట్లోనే... పరీక్షకు హాజరైన కుమార్తె, ఐశ్వర్య చూపిన ధైర్య సాహసం గ్రామస్తులను కలిసివేసింది.

దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ది తెలంగాణ మిర్రర్): ఒక వైపు తండ్రి మరణం మరొకవైపు కూతురుకు పదవ తరగతి ఆఖరి పరీక్ష మండల పరిధిలోని గొడుగుపల్లి గ్రామంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. దౌల్తాబాద్ మండల పరిధిలోని గొడుగు పల్లి గ్రామానికి చెందిన చందా శ్రీనివాస్ గ్రామంలో కరెంటు వర్కర్ గా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్న, చంద శ్రీనివాస్ (35) గత కొద్ది రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ అనారోగ్యంతో మృతి చెందాడు. చందా శ్రీనివాస్ కు ఒక కూతురు ఐశ్వర్య,కుమారుడు కలరు. కూతురు ఐశ్వర్య పదవ తరగతి చదువుతుంది.పదవ తరగతి చదువుతున్న చందా ఐశ్వర్య జీవితంలో అత్యంత విషాద సమయంలోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించింది. ఆమె తండ్రి శ్రీనివాస్ అనారోగ్యంతో మృతి చెందగా, సోమవారం ఐశ్వర్యకు పదవ తరగతి పరీక్ష ఉండటం గమనార్హం.ఇంట్లో తండ్రి మృతదేహం ఉండగానే, కుటుంబ సభ్యుల ఆవేదన మధ్యలోనూ ఐశ్వర్య తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షకు హాజరైంది. కన్నీరుతోనే పరీక్ష కేంద్రానికి వెళ్లిన ఆమె ధైర్యం అందరినీ కదిలించింది. తండ్రి కోరిక మేరకు చదువులో ముందుకు సాగాలని సంకల్పించిన ఐశ్వర్య తన బాధను పక్కనపెట్టి పరీక్ష రాయడం గ్రామస్థుల ప్రశంసలు పొందింది. ఈ సంఘటన స్థానికులను విషాదంలో ముంచేసింది. ఒకవైపు కుటుంబానికి తీరని లోటు, మరోవైపు కుమార్తె చూపిన మనోధైర్యం అందరినీ భావోద్వేగానికి గురి చేసింది. ఐశ్వర్యకు మంచి భవిష్యత్తు ఉండాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.ఈ ఘటన విద్యార్థుల్లో సంకల్పబలం, బాధ్యత ఎంత ముఖ్యమో మరోసారి చాటిచెప్పింది.

ఉపాధి హామీలో గాజులపల్లి గ్రామానికి గుర్తింపు

దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ది తెలంగాణ మిర్రర్): మండల పరిధిలోని గాజులపల్లి గ్రామం ఉపాధి హామీ పథకంలో ఒకే రోజు అత్యధిక పని దినాలు కల్పించిన గ్రామంగా జిల్లాలో ఎంపికైంది. ఈ విషయాన్ని గాజులపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులు తెలిపారు.ఈ సందర్భంగా కూలీలకు అత్యధికంగా పని కల్పించినందుకు డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గాజులపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ నర్సింహులను శాలువాతో సత్కరించి నగదు ప్రోత్సాహకం అందజేశారు. గాజులపల్లి గ్రామం ఈ గుర్తింపు పొందినందుకు ఎంపీడీవో అష్టలక్ష్మీ, ఏపీవో రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు అభినందనలు తెలిపారు. ఇతర గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా ఇదే విధంగా ముందుకు వచ్చి ఉపాధి హామీ కూలీలకు ఎక్కువ పని దినాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు.

ఇందుప్రియల్ లో వేసవిలో నీటి సమస్య తీర్చడానికి కొత్త బోరు ప్రారంభం.

దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ది తెలంగాణ మిర్రర్): మండలంలోని ఇందుప్రియల్ గ్రామపంచాయతీలో వేసవిలో తలెత్తే నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని అధికారులు, గ్రామ ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలో కొత్త బోరు త్రవ్వించి మోటార్‌ను ఏర్పాటు చేసి నీటి సరఫరాను ప్రారంభించారు. సోమవారం గ్రామ సర్పంచ్ వీరమ్మ స్వాతి స్వామి, దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వీరమ్మ స్వాతి స్వామి మాట్లాడుతూ. గ్రామ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అప్పాయిపల్లిలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం..

దౌల్తాబాద్, ఏప్రిల్ 13 (ది తెలంగాణ మిర్రర్): మండల పరిధిలోని అప్పాయి పల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ పోసాని యాదగిరి ఈ పనులను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ.5 లక్షల నిధులు మంజూరు చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నర్సింలు, మాజీ ఉప సర్పంచ్ కేశబోయిన ప్రభాకర్, రమేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.